
## కథ

# దిబ్బ రాజ్యంలో ఎన్నికలు

(కొడవటిగంటికి కృతజ్ఞతలతో)



'కారిపురుషోత్తమరావు

దిబ్బ రాజ్యంలో మళ్లీ ఎన్నికలు వచ్చేసాయి. ప్రతి సంవత్సరమూ వచ్చే తుఫానులాగా ఎంత మాత్రం హెచ్చరిక లేకుండా వచ్చాయని. రేపో, ఎల్లుండో తీరం తాకుతుందనగా తుఫాన్ సూచనలను గురించి చెప్పే దివ్య దర్శన్, దివ్యవాణి కేంద్రాల న్నింటి నుంచి ఎన్నికల ప్రకటన వెలువడింది.

ఎన్నికల ప్రకటన పెద్ద విస్ఫోటనంలాగా దేశమంతా మబ్బులను సృష్టించింది. ఎన్నికల ప్రకటన కుట్ర అని కొందరంటే సాహసిక చర్య అని మరి కొందరన్నారు. జనాభాను మించినన్ని రాజకీయ పార్టీలతో కులకులలాడి పోతోందని కొందరు గర్వపడుతుంటే, సంప్రదాయకంగా ఆ రాజ్యాన్ని పరిపాలిస్తున్న పార్టీ బాధ పడుతోంది. ఇన్ని దశాబ్దాల పాటు తమ పార్టీ పట్ల విశ్వాసాన్నీ గౌరవాన్నీ ప్రకటిస్తూ వచ్చిన ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ఆ రాజ్యాన్ని శాశ్వతంగా తమకు అధీనం చేయడం ధర్మమని ఆ పార్టీ అభిప్రాయ పడింది. ప్రజల కోర్కెను, ప్రజల వాంఛను కాదనడం అన్యాయమన్న అభిప్రాయం కూడా బహిరంగంగానే వెలిబుచ్చిందా పార్టీ. అందుకవసరమైన ధార్మిక సూత్రాలను చరిత్ర పూర్వకాలం నుంచి తవ్వి తీసుకు వచ్చింది. కనీసం ప్రస్తుత ప్రధాని జీవిత కాలం వరకైనా తమ పార్టీ పాలనను రాజ్యాంగ బద్ధం చేసినా సంతృప్తి పడతామని ఆఖరి విజ్ఞప్తి చేసింది.

ప్రతిపక్ష పార్టీలు భిన్న స్వరాలతో పాలక పార్టీని ఓడించండని పిలుపునిచ్చాయి. ప్రజలకు ఆ పిలుపు ఒక సామూహిక గానంలాగా కాక, అపశ్రుల కలగలుపులా వినబడ్డప్పటికీ ప్రతి పక్ష పార్టీలు తమది సామూహిక గానమేనని విడి విడిగా ప్రకటించాయి. ఎటూ వచ్చి తమ ప్రకటనలను కలిపి ఒక రాగంగా ఒక గీతంగా పాడుకోవలసిన బాధ్యత ప్రజలదేనని చెప్పాయి. పాలక వర్గ పార్టీ నుంచి కొందరు రాజీనామా చేసి తమకను కూలమైన ప్రతిపక్ష పార్టీలో చేరిపోగా, ప్రతిపక్ష పార్టీల సంఖ్య మరింత పెరిగింది. పార్టీల సంఖ్య పెరగడం కూడా తమ ఐక్యతకు చిహ్నమేనని ప్రతిపక్ష పార్టీలు మళ్ళీ ప్రకటనలు చేశాయి, గర్జించాయి.

ప్రతిపక్ష పార్టీలలోని ముఖ్య బృందం మిగతావారి సహాయ సహకారాలతో అధికారం సాధించగల మని సగర్వంగా ప్రకటించింది. "మీ బృందం గెలిస్తే, గిలిస్తే దేశాధినేత ఎవ్వరు?" అని సవాలు విసిరింది పాలక పార్టీ. "మాలో ఎవరైనా దేశాధినేత అయ్యే సమర్థులే!" అని చటుక్కున సమాధానం ఇచ్చాడో నాయకుడు. "చూసారా! ఒక్క దేశాధినేతతో సరిపెట్టుకుంటున్న మా పార్టీని కాదని ఈ బృందాన్ని ఎన్నుకుంటే ఎందరు దేశాధినేతల అక్రమాలకు, అవినీతికి బలై పోతారో మీరు ఆలోచించండి. కాబట్టి ప్రజలారా! మమ్మల్నే మళ్ళీ గెలిపించండి" అని మహోత్సాహంగా ప్రకటించింది పాలక పార్టీ.

ఈలోగా ప్రతిపక్ష పార్టీల్లో ముఖ్యంగా కుడి చేతి పార్టీ, ఎడమ చేతి పార్టీలు... మరీ ఎడ ముఖం పెడముఖం పెట్టుకున్నట్టు పత్రికలు వార్తలు ప్రకటించాయి. రహస్యంగానూ, బహిరంగం గానూ కూడా ఆ పార్టీల నాయకులు ఆ అభిప్రాయాలను స్పష్టంగానే చెప్పారు. "ఎడమ పార్టీలనూ, పాలక పార్టీని ఓడించి తీరుతాం" అని కుడి పార్టీ చెపితే "పాలక పార్టీని ఓడించడానికి కుడి పార్టీ సహాయం అవసరం లేనే లేదనీ, అది సామాజిక శాస్త్రం అర్థం చేసుకున్న ఎవరికైనా బోధ పడుతుందనీ" ఎడమ పార్టీలు సాధికారంగా చెప్పాయి. కుడి పార్టీకి రోషం వచ్చింది.

"లక్షల సంవత్సరాల నాగరికతకు వారసులమైన మాకు సామాజిక శాస్త్రం గురించి చెప్పే హక్కు నిన్న కాక మొన్న కళ్ళు తెరిచిన ఎడమ పార్టీలకు లేదు" అని తేల్చేసింది. "నిజమే! మీరు లక్షల సంవత్సరాలనాడు ఉండవలసిన వారే!" అని చమత్కారం చేస్తారు ఎడమ పార్టీ వారు. మళ్ళీ పాలక పార్టీ "చూశారా! ప్రతిపక్షాలు ఎలా కాట్లాడుకుంటున్నయ్యో! అయ్యో! దేశ ప్రజలారా! మిమ్మల్ని ఈ కాట్ల కుక్కలకు వదిలి పెట్టం" అని దుఃఖించింది. "కుడి ఎడమల దగాదగా అని పాటలు పాడింది.

ప్రతిపక్ష పార్టీల్లో ముఖ్య బృందానికి హఠాత్తుగా జ్ఞానోదయమైంది. కుడిపార్టీ వారినీ, ఎడమ పార్టీల వారినీ విడి విడిగా కలుసుకుని ఒప్పందాలు చేసుకుంది. "కుడి పార్టీ, ఎడమ పార్టీలు అన్న పేరుల్లోనే మీరు కలవరని తేలి పోయింది. కలవక్కర్లేదు. మాకు సహాయ పడండి. మీకు మేం సహాయ పడతాం. మీరిద్దరూ పోటీ చేసిన చోట మేం సరదాగా వినోదం చూస్తాం. మీకు వీలైన చోట మీరూ వినోదం చూడండి. ఏది ఏమైనా పాలక పార్టీని ఓడించాలి. ఓడించాలి" అని ముద్దు చేసి చెల్లించి ఆ పార్టీలను జోకొట్టారు.

ఎడమ పార్టీలలో కొంచెం సంచలనం వచ్చింది. "నిన్నటి దాకా కుడి పార్టీతో మనకు కలవదన్నారు. ఇప్పుడు మనం కుడివైపుకే వెళ్తున్నట్టు మాకు అనిపిస్తోంది" అని అనుమానం వెలిబుచ్చారు. "అవును మిత్రమా! నీవన్నది నిజం నిజం! అయితే ఇందులో శాస్త్రీయ దృక్పథాన్ని నువ్వు చూడలేనందుకే మాకు విచారంగా ఉంది. కొలంబస్ ఎక్కడికని బయలు దేరాడు? భారత దేశానికని. భారత దేశం ఏదిక్కున ఉంది? తూర్పున. మరి కొలంబస్ ఎటువైపు ప్రయాణించాడు? పడమర వైపుకు. శాస్త్రీయ పద్ధతిలో కొలంబస్ అనుసరించిన మార్గాన్నే మనం పోతున్నాం. మన గమ్యం చేరుతాం! అంతిమ విజయం మనదే!" అని గంభీరమైన సమాధానం వచ్చింది. శాస్త్రీయమైన సమాధానం రాగానే ఆ పార్టీల నాయకులూ, వారి అనుచరులూ గాఢంగా నిట్టూర్చి సంతృప్తి చెందారు. కుడి పార్టీ వారికి ఈ ఇబ్బంది కూడా లేదు. వారి నాయకులూ, అనుచరులూ నాయకుల నెప్పుడూ తప్పు బట్టరు. లక్షల సంవత్సరాల నాగరికతకు వారసులు తప్పులు చేయరు కదా!

"పాలక పార్టీ, ప్రతి పక్ష పార్టీలు అన్నీ ఒక తానులో ముక్కలే! ఎవర్నీ నమ్మకండి. మాకు ఓట్లేయండి" అని ఎడమాతి ఎడమ పార్టీ ప్రకటించింది. వారు 700 సీట్లకు గాను 7 సీట్లకు పోటీ చేస్తున్న సంగతి తెలిసిన ప్రజలు వారి వినయానికి జోహార్లర్పించారు.

"ఒకవైపున విప్లవ కెరటం దేశాన్ని ముంచెత్తుతూ ఉంటే ఎన్నికల మత్తు చూపించి ప్రజలను మభ్య పెట్టలేరు. ప్రజలు ఎన్నికలలో పాల్గొనరు. విప్లవంలోనే పాల్గొంటారు" అని తమ విశ్వాసాన్ని దృఢంగా వ్యక్తం చేశాయి కొన్ని పోస్టర్లు.

"ఆకాశంలో సగంగా ఉన్న స్త్రీలకు సగం సీట్లు కూడా కేటాయించని రాజకీయ పార్టీలను మేము తీవ్రంగా నిరసిస్తున్నాం. ఈ ఎన్నికలను మేము బహిష్కరిస్తున్నాం" అని ప్రకటన తయారు చేసింది మహిళా విమోచనా సంఘటన. కాని ఎన్నికల బహిష్కరణ తమకంటే ముందు మరో పార్టీ ఇవ్వడం వలన ఆ ప్రకటనను విడుదల చేయలేదు.

మొత్తమ్మీద నామినేషన్లు వేసే వాటికి ఎన్నికల వేడి అందుకుంది. నామినేషన్లు వేసిన తర్వాత అన్ని పార్టీల వారూ శాయశక్తులా తాము చేయగల అక్రమ కార్యక్రమాలన్నింటికీ చక్కని ప్రణాళికలు వేసుకున్నారు. ఆ పద్ధతిలోనే కొందరి ప్రాణాలు తీశారు. కొన్ని ప్రాణాలను త్యాగం చేశారు.

ఎన్నికలయిపోయాయి. దేశమంతటా సుమారుగా అరవై శాతం ఓట్లు పోలయ్యాయని అంచనా. మరో ఐదేళ్ళు దిబ్బరాజ్య పాలకులంతామేనని ప్రభుత్వ పక్షం గంభీరమైన ప్రకటన చేసింది. ప్రజలకు తమ కృతజ్ఞతలు కురిపించింది.

ఎన్నికలు ముగిసిన మరుక్షణం ప్రతిపక్షాలు ఎవరి గొంతు వారే చించుకుంటూ మాట్లాడాయి. దశాబ్దాల పీడను వదిలించుకున్న ప్రజలకు అభినందనలు తెలిపాయి.

తమ విశ్వాసాన్నివ వమ్ము చేయకుండా వోట్లను పోల్ చెయ్యని నలభై శాతం ప్రజలకూ విప్లవాభి వందనాలు తెలియజేస్తూ, జరుగుతున్న విప్లవ పోరాటంలో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తూ మళ్లీ పోస్టర్లు వెలిశాయి.

ఫలితాలను గురించి ఎవరి గుబులు వారికుంది. అయితే ఎవరి గాంభీర్యం వారు చూపిస్తున్నారు. ఎలాగైతేనేం! ధైర్యం చేసి ఒక ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడు పాలక పక్షానికి చెందిన చోటా నాయకుడితో జనాంతిక సమావేశం జరిపారు.

గంభీరంగా ప్రారంభమైన ఆ సమావేశం సగం జరిగే సరికి, ఎన్నికల ఫలితాలను గురించి ఇద్దరికీ భయమున్నట్టు ఇద్దరూ గుర్తించారు. ఒక్కసారి గావురుమని... కావిలించుకుని దుఃఖించారు. కన్నీటితో కలక తీరిపోగా కింకర్తవ్యం? అనే ప్రశ్న వచ్చింది. "ఎన్నికల ఫలితాలను నిలుపుచేసి అన్ని పార్టీలూ సర్దు బాట్లు చేసుకునే అవకాశం రాజ్యాంగంలో ఏ మూలైనా ఉండక పోతుందా" అన్న ఆశ మూలకెత్తి, చెట్టై, వృక్షమై, శాఖోప శాఖలుగా విస్తరించింది. తమ నాయకులకు ఈ ఆశా దీపాన్ని అందించారు వారు. రాజాంయగ నిపుణులతో సంప్రదించారు. రాజ్యాంగ నిపుణులు విదేశీ నిపుణులు సంప్రదించారు. అమెరికాకు చెందిన రిచర్డ్సన్ అండ్ నిక్సన్సన్ అన్న న్యాయవాదుల కంపెనీ ఒక్క మార్గాన్ని గుర్తు పట్టగలిగింది. దిబ్బ రాజ్యపు రాజ్యాంగంలో 111వ అధికరణంలో "దేశపు యావత్ప్రజల ఏకాభిప్రాయం సూచనగా లభించినప్పుడు దేశాధ్యక్షుడు తన అంతరాత్మ సాక్షిగా పార్లమెంటును నిర్మించ వచ్చును" అనే వాక్యం ఆధారాన్ని ఆ కంపెనీ చూపించగా భూవ భోంతరాళాలు దద్దరిల్లేటట్లు హర్ష ధ్వానాలు చేశారు. రాజకీయ పక్షాల నాయకులు, తమ ఏకాభిప్రాయమే ప్రజల ఏకాభిప్రాయంగా పరిగణించ వచ్చునని రాసి, ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎఫిడవిటు ట్లు, హామీ పత్రాలు అధ్యక్షుల వారికి పంపుకున్నారు. ఇవన్నీ కంప్యూటర్ల సహాయంతో క్షణాల మీద పరిష్కారమయ్యాయి.

అధ్యక్షుడు వివిధ రాజకీయ పక్ష నాయకులకు విడి విడిగా ఆహ్వానాలు పంపి అందర్నీ కలుసుకున్నారు. ఎడమాతి ఎడమ పార్టీ వారు ఈ వ్యవహారాల్లో పాల్గొనలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో పార్లమెంటును నిర్మించడానికి తీర్మానించుకున్న అధ్యక్షుడు, ఆయా పార్టీల నాయకులను విడి విడిగా వేరు వేరు గదుల్లో కూర్చోబెట్టారు. "మీ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తుందని మీరు భావిస్తున్నారో... వారెవరెవరో ఒక జాబితా రాసి నాకు సమర్పిస్తే నేను చేయగల సహాయం చేస్తాను" అని అన్ని పార్టీల వారికీ తెలియ జేశాడు. "మీరు అడిగే సంఖ్య మరీ అవాస్తవికంగా ఉంటే ఓట్లు లెక్క బెట్టిస్తాను" అని ఆఖరు మాటగా వారిని భయపెట్టాడు.

ప్రతి నాయకుడూ ఆశకూ, భయానికీ మధ్య గిజ గిజలాడాడు. కాని రోట్లో తలపెట్టిం తర్వాత భయపడీ ప్రయోజనం లేదు కదా! జాగ్రత్తగా తనకు సరఫరా చేయబడిన దిబ్బ రాజ్యం పటాన్ని ఎదురుగా పెట్టుకుని వాస్తవంగా తమకు వచ్చే సీట్లను రెట్టింపు చేసి, కాగితమ్మీద పెట్టేటప్పుడు మరో సారి రెట్టింపు చేసి తమ పార్టీ పార్లమెంటు సభ్యుల జాబితాను తయారు చేశాడు. పాలక వర్గ పార్టీ నాయకుడు మాత్రం జాగ్రత్తగా ఆలోచించి తమ పార్టీకి మూడింట రెండు వంతుల మెజార్టీ సభ్యులుండేట్లు లెక్కలు కట్టి జాబితా తయారు చేశాడు. మొదటి సమావేశంలోనే అధ్యక్షుణ్ణే విశ్వాస రాహిత్య తీర్మానం చేసి బయటకు నెట్టేయాలని కూడా ఆయన నిర్ణయించుకున్నాడు. కుడి పార్టీ తక్కువేమీ తినలేదు. తమ అభ్యర్థులు పోటీ చెయ్యని స్థానాలు కూడా జాబితాలో ఇరికించాడా నాయకుడు. ఎడమ పార్టీల నాయకులు గుస గుస లాడుకునే అవకాశం లేనందుకు మాత్రం ఎంతో బాధ పడ్డారు. తమ సిద్ధాంత గ్రంథాలనైనా సరఫరా చేసి పెట్టమని అధ్యక్ష కార్యాలయాన్ని కోరారు. వారు సహజంగానే తిరస్కరించారు. మొత్తమ్మీద తలుపులూ కిటికీలూ మూసి వేసి ఎవరూ చూడలేరని నమ్మకం కలిగిం తర్వాత మాత్రమే ధైర్యంగా తమకున్నదని భావిస్తున్న బలాన్ని రెట్టింపు చేసి... జాబితాలు తయారు చేశారు. అందులో ఒకాయనకి "రెండో నాయకుడు తన కంటే పెద్ద అంకె వేయడం లేదు కదా" అని అనుమానం వచ్చింది. కాని ఉద్యమ సాఫల్యానికి కొంచెమైనా త్యాగం చేయాలి గదా! అని సరిపెట్టుకున్నాడు.

అసలు గొడవంతా ప్రతిపక్షంలోని ముఖ్య బృందానిది. ఆ బృందంలో ప్రాంతీయ పార్టీలున్నాయి కదా! ప్రాంతీయ పార్టీలు అప్పటికే కొన్ని సీట్లు 'త్యాగం' చేసి మిత్రపక్షాలకు పంచి ఇవ్వడంతో ఇరకాటంలో పడ్డాయి. అందుకే కళ్ళు మూసుకుని పోటీ చేసిన అన్ని స్థానాలకూ తమ అభ్యర్థుల పేర్లే రాసి పారేశారు.

అధ్యక్షుడు అన్ని పార్టీల నాయకులతోనూ విడి విడిగా మాట్లాడాడు. అందరిలో కంటే ఆయన్ను ఆకర్షించిన వారు కుడి పార్టీ వారు, వారి అభ్యర్థుల జాబితానూ, వారడిగిన సీట్ల జాబితానూ మార్చి మార్చి చూసి పక్కున నవ్వాడు. "మీరు నవ్వుతున్న కారణం నాకు తెలుసు. కాని ఒక విషయం మీరాలోచించండి. మీరు పార్లమెంటు ను ఇలా నిర్మిస్తారని తెలిస్తే మీకు ఇచ్చిన జాబితా ప్రకారమే అభ్యర్థులను నిలబెట్టే వారం" అని చెప్పారాయన. "కాని ఇలాంటి అవక తవకలు చేస్తే ఓట్ల లెక్కింపుకు సిద్ధం చేస్తానన్నాను కదా!" అన్నాడు అధ్యక్షుడు. "దాన్నే మీ యిష్టం వచ్చినన్ని సీట్లు ఇవ్వండి సరిపెట్టుకుంటాం" అని భయంగా, హుందాగా చెప్పాడు కుడి నాయకుడు. "మీరు పోటీ చేసిన సీట్లలో మూడింట రెండు వంతులు ఉంచుకోండి. కొట్టి వేయాల్సిన పేర్లు కొట్టి వేయండి" అని జాబితాను ఆయన కందించాడు. ఆయన కొట్టి వేతల కార్యక్రమానికి దిగాడు.

ఎడమ పార్టీ నాయకులను పిలిచాడు అధ్యక్షుడు. నాయకులిద్దరూ 'గుమ్మం' దగ్గర తట పటాయించి లోపలికెళ్ళారు. "మీరు తయారుచేసిన జాబితాలు [illegible]! మీరు పోటీ చేసిన స్థానాల్లో మూడింట రెండు వంతుల స్థానాలుకేటాయించుకోండి" అని జాబితాలు అందించాడు అధ్యక్షుడు. ఎడమ పార్టీ నాయకులు నాలుక్కరుచుకున్నారు "ఏమిట" న్నాడు అధ్యక్షుడు. "మూడింట రెండు వంతులన్నారు కదా! మా జాబితాలో అంతకంటే తక్కువ ఉంటే మిగతా పేర్లు రాసుకోవచ్చునా! రాజ్యాంగ విరుద్ధం కాదు గదా!" అని నీళ్ల నమిలారు. అధ్యక్షుడు నవ్వి సరేనన్నాడు.

ఈ రకంగా జరిగిన తంతు పూర్తయిం తర్వాత అధ్యక్షుల ప్రకటన ఇలా వెలువడింది "దేశంలో ఇటీవల ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల వలన పార్లమెంటు ఎన్నికలను స్థంభింప చేసి, దిబ్బ రాజ్యపు రాజ్యాంగంలో 111వ అధికరణం ద్వారా నాకు లభ్యమైన అధికారం ద్వారా పార్లమెంటును పునర్నిర్మిస్తున్నాను. మన దేశంలో ప్రజా స్వామ్య విస్తరణకు అవసరమేర్పడిన కారణాన పార్లమెంటును సభ్యుల సంఖ్యను 700 నుంచి 1400కు పెంచుతున్నాను. ఆయా రాజకీయ పక్షాలు సమర్పించిన జాబితాల ప్రకారం ఈ సభ్యులను నియమించాను. ఇందులో అధ్యక్ష కార్యాలయానికి రాజకీయోద్దేశ్యాలను ఆపాదించే అవకాశం ఎంత మాత్రం లేదని ఈ ప్రకటన ద్వారా స్పష్టం చేస్తున్నాను. మొదటి పార్లమెంటు సమావేశం చైత్రశుద్ధ పంచమినాడు జరుగుతుంది."

చైత్ర శుద్ధమి పంచమి రాక ముందే మంత్రి వర్గ నిర్మాణం జరిగింది. పాలక పార్టీ అందరి కంటే ఎక్కువ సీట్లను కోరినందు వలనా, అదీ సూత్ర బద్ధంగా మూడింట రెండు వంతుల సీట్లను మాత్రమే కోరినందు వలనా... దాన్నే మంత్రివర్గం ఏర్పాటు చేయవలసిందిగా అధ్యక్షుడు కోరాడు. మంత్రి వర్గం ఏర్పాటు చేసే హక్కు సంక్రమించిన తక్షణం పాలక పార్టీకి మెజారిటీ వచ్చేసింది.